పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

- నుడా అనుమతుల్లేకుండానే ఏర్పాటు
- ప్రభుత్వ నిబంధనలు పాటించని రియల్టర్లు
- ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- తాజాగా క్రమబద్ధీకరించుకోవాలని ప్లాట్ల కొనుగోలుదారులపై ఒత్తిడి
- ఎల్ఆర్ఎస్ పేరుతో అదనపు వసూళ్లు
- లబోదిబోమంటున్న ప్లాట్ల కొనుగోలుదార్లు



వింజమూరులో అక్రమంగా వేసిన లేవుట్

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలో అక్రమ లేవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నుడా అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే లేఅవుట్లను రియల్టర్లు వేస్తున్నారు. అక్రమ లేఅవుట్లను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కొనుగోలుదారులను మభ్యపెట్టి ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను తీసుకొచ్చి అనుమతుల్లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నగదు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని, లేకపోతే రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తామని హెచ్చరిస్తోంది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు.

జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం

ఉదయగిరి నియోజకవర్గంలో కావలి-సీతారామపురం, కందుకూరు-సీతారామపురం జాతీయ రహదారులతో పాటు విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. దీంతో కొంతమంది రియల్టర్లు భూములు కొనుగోలు చేసి నుడా అనుమతులు, నిబంధనలు పాటించకుండానే లేవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. అక్రమ లేవుట్లను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కొనుగోలుదారులను మభ్యపెట్టి ప్లాట్లను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా వింజమూరులో ఇటీవల జాతీయ రహదారిని వెంబడి అధిక సంఖ్యలో అక్రమ లేవుట్లు వెలిశాయి. వింజమూరు, లెక్కవారిపాళెం, నందిగుంట, బొమ్మరాజు చెరువులో 25లేవుట్లు ఏర్పాటు చేయగా, అందులో కేవలం మూడింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగిలినవి అక్రమంగా ఏర్పాటు చేసినవే. సుమారు 250 ఎకరాల్లో ఐదువేలకుపైగా ప్లాట్లతో నుడా, డీటీసీపీ అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేశారు. వీటిలో చాలా వరకు ప్లాట్లు అమ్మేశారు. తాజాగా అక్రమ లేవుట్లలో క్రయ విక్రయాలు జరపరాదని పంచాయతీ, మండల పరిషత్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు నుడా అధికారులు లేఖలు పంపడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.



అక్రమ లేవుట్‌లో నోటీసు అంటిస్తున్న నుడా అధికారులు

నిబంధనలు ఇలా..

- లేఅవుట్లు వేసే ముందు వ్యవసాయ భూమి అయితే వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి.
- లేఅవుట్ వేసే భూమిలో గుడి,బడి, తదితర సామాజిక ప్రయోజనాల కోసం పదిశాతం స్థలాన్ని కేటాయించాలి.
- రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలి.
- నుడా, డీటీసీపీ అనుమతులు తీసుకుని ప్లాట్లు విక్రయించాలి

ఎల్ఆర్ఎస్ పేరుతో ఒత్తిళ్లు

కూటమి ప్రభుత్వం అక్రమ లేవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ పథకం తీసుకొచ్చింది. దీని ప్రకారం అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ప్రభుత్వ మార్కెట్ ధర ప్రకారం ఏడు శాతం ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. ఇందుకోసం వచ్చే నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. లేకపోతే ప్లాట్లను నిషేధిత జాబితాలో ఉంచుతామని నుడా అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లేవుట్లు వేసి రియల్టర్లపై చర్యలు తీసుకోకుండా ప్లాట్ల కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టడంపై వారు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ పేరుతో బలవంతం చేయడం ఏమిటని కొనుగోలుదారులు ప్రభుత్వ పెద్దలను ప్రశ్నిస్తున్నారు. అక్రమ లేవుట్లు వేసిన రియల్టర్ల వద్ద నుంచి ఎల్ఆర్ఎస్ ఫీజు వసూ లు చేసి క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

అక్రమ లేవుట్లను నిర్మాణ సమయంలోనే రెవెన్యూ, పంచాయతీ అధికారులు అడ్డుకోవాలి. నిబంధనల మేరకు అనుమతులు తీసుకోకుండా లేవుట్లు వేసే వారిపై కేసులు నమోదు చేయాలి. ప్లాట్ల క్రయవిక్రయాలు జరపకుండా సర్వే నంబర్లు దాఖలు పరుచుతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు లేఖలు పంపాలి. విద్యుత్ అధికారులు సైతం విద్యుత్ సౌకర్యం కల్పించకూడదు. కానీ లేవుట్ల యజమానుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు లంచాలు తీసుకుని పట్టించుకోవడం లేదు. దీంతో ప్లాట్ల కొనుగోలుదారులు నష్టపోతున్నారు. ప్లాట్లపై రుణాలు, విద్యుత్ కనెక్షన్, రోడ్లు, డ్రైనేజీ, తదితర సౌకర్యాలను పొందలేకపోతున్నారు.

క్రమబద్ధీకరించుకోవాలి



లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసిన వారు ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని క్రమబద్ధీకరించుకోవాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం. అనుమతుల్లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా క్రమబద్ధీకరించుకోవాలి.

– కే శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ, వింజమూరు

క్లుప్తంగా

కుస్తీ పోటీల్లో బట్టేపాడు విద్యార్థుల సత్తా



ఆత్మకూరురూరల్: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీల్లో ఆత్మకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపారని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటకృష్ణయ్య తెలిపారు. అండర్–17 46 కేజీల విభాగంలో ఐశ్వరయ్య, అండర్–15 36 కేజీల విభాగంలో అలేఖ్య, 54 కేజీల విభాగంలో కావ్య, 62 కేజీల విభాగంలో ప్రవల్లిక, తదితరులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని దగుమాటి భార్గవి, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



మర్రిపాడు: మహాలయ అమావాస్య సందర్భంగా మండలంలోని డీసీపల్లి శివాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం శివుడికి రుద్రాభిషేకం, రుద్రహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పెద్దలకు పిండ ప్రదానాలు చేశారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం బుక్కాపురం పంచాయతీ పరిధిలోని చంద్రపడియ తొగటపాళెంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెరుకూరి రసూల్, ఉపసర్పంచ్ కాటం రమణారెడ్డి కాలనీవాసులతో మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారిస్తామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే సమావేశంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటరీ పరిశీలకుడు జంకే వెంకటరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

సోమశిల: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరిచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన అనంతసాగరంలో విలేకరులతో మాట్లాడారు. అనంతసాగరం మండలంలో ఎడగారు పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మిల్లర్లతో దళారులు కుమ్మక్కై ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. విధి లేని పరిస్థితుల్లో రైతులు దళారులు అడిగిన ధరకు అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులకు మద్దతు ధరను అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధాన్యం మద్దతు ధరల కోసం పోరాడేందుకు సీపీఎం సిద్ధంగా ఉందన్నారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో వచ్చేనెల 7న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి పిలుపునిచ్చారు. నగరంలోని స్థానిక శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి అధ్యక్షతన విస్తృత సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఉపాధ్యాయులకు సంబంధించి ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. 22న బాలత్రిపురసుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న లలితాత్రిపురసుందరీదేవి, 25న సరస్వతీదేవి, 26న అన్నపూర్ణాదేవి, 27న మహాలక్ష్మీదేవి, 28న రాజరాజేశ్వరీదేవి, 29న కాత్యాయినీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దిని, 2న విజయదశమి సందర్భంగా భద్రకాళీదేవిగా అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారని చెప్పారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు.



కలిగిరి: విద్యుద్దీపాలంకరణలో భద్రకాళి ఆలయం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలోని కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షిదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు రామకృష్ణశర్మ ఆదివారం తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించనున్నట్లు చెప్పారు. తొలిరోజైన సోమవారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులను కటాక్షించనున్నట్లు చెప్పారు. నిత్యం అమ్మవారికి సహస్రనామార్చన, త్రిశతి ఖడ్గమాల పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే



వర్షానికి రొచ్చురొచ్చుగా మారిన చంద్రారెడ్డిపాళెం రోడ్డు



నడిచి వెళ్లేందుకు వీల్లేకుండా బురదతో నిండిన రోడ్డు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని చంద్రారెడ్డిపాళేనికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది.కృష్ణారెడ్డిపాళెం–రాజుపాళెం ప్రధాన రహదారి నుంచి చంద్రారెడ్డిపాళేనికి వెళ్లే మట్టిరోడ్డు అభివృద్ధికి నోచుకోక గుంతలమయంగా మారింది. మట్టిరోడ్డుపై తట్ట మట్టి కూడా వేయకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా రొచ్చుగా రొచ్చుగా మారుతున్నది. దీంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు జారిపడుతున్నారు. మరోవైపు నడిచి వెళ్లేందుకు వీల్లేక పాదచారులు అవస్థ పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి సిమెంట్‌రోడ్డు వేసి సమస్యను పరిష్కారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వర్షానికి నేలవాలిన ఎడగారు పంట

ఆత్మకూరురూరల్: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి మహిమలూరు, బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, కోటపాడు, నారంపేట, మురగళ్ల, బండారుపల్లి, కనుపూరుపల్లి, తదితర గ్రామాల్లో వెన్నుదశలో ఉన్న ఎడగారు పంట నేలవాలింది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ధాన్యానికి గిట్టుబాటు ధరలేక లబోదిబోమంటున్నారు. దీనికి తోడు గోరుచుట్టుపై రోకటి పోటులా వరి నేలవాలడంతో మరింత నష్టం కలిగించిందని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మహిమలూరులో వర్షానికి పడిపోయిన వరి పంట

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



అల్లూరు: స్థానిక డీఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కావలి నియోజకవర్గానికి చెందిన 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అపస్మా సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, ఎస్ శ్రీధర్, పీ కృష్ణారావు, కే శివకుమార్, జీ వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నేడు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి షేక్ అస్మా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఆరోగ్యపరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు వైద్యపరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఆత్మకూరురూరల్: వివాహిత అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు..కలిగిరి మండలం చీమలవారిపాళేనికి చెందిన యువతిని పొదలకూరు మండలానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వారు బద్వేలులో బొగ్గుబట్టీల వద్ద పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 6న యువతిని నెల్లూరుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద బంధువులు బద్వేలుకు వెళ్లే బస్సు ఎక్కించారు. ఆ తరువాత నుంచి ఆమె కనిపించ లేదు. సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్‌లో ఉంది. అప్పటి నుంచి ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి ధనమ్మ ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జిలానీబాషా తెలిపారు.

అనుమతుల్లేకుండానే ఎగ్జిబిషన్ ఏర్పాటు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని దొరసానమ్మతోటలో అనుమతుల్లేకుండానే ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. హజరత్ ఖాజానాయబ్ రసూల్ వారి గంధ మహోత్సవం సందర్భంగా కొందరు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఎటువంటి అనుమతులు, ఎలాంటి సేఫ్టీ , ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండానే ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు విద్యుత్‌ను సైతం అక్రమంగా వినియోగించుకుంటున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని, చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్, పోలీసు శాఖల అధికారులు స్పందించి ఎగ్జిబిషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మోటార్‌ను ఏర్పాటు చేయరూ..



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌ను అనుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. అందులో తాగునీటి బోరును సైతం చేశారు. అంతలో ఎన్నికలు రావడంతో మోటార్‌ను బిగించలేదు. దీంతో నీటి వసతి లేక గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. అధికారులు స్పందించి బోరుకు మోటార్‌ను బిగిస్తే గృహాలను నిర్మించుకుంటామని లబ్ధిదారులు కోరుతున్నారు.

షుగర్ వ్యాధి నియంత్రణే లక్ష్యంగా..

- విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు..
- తరగతి గదుల్లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు
- పాఠశాల విద్యాశాఖ వినూత్న ఆలోచన



తరగతి గదుల్లో ఏర్పాటు చేయనున్న షుగర్ బోర్డు

సీతారామపురం : రాష్ట్రంలో షుగర్ వ్యాధి (మధుమేహం) కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చిన్ననాటి నుంచే షుగర్ వ్యాధిపై అవగాహన కలిగిస్తే రేపటి పౌరులు మరింత ఆరోగ్యంగా ఉంటారని భావించి పాఠశాల విద్యాశాఖ వినూత్న ప్రయోగానికి సంకల్పించింది. తరగతి గదిలో షుగర్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నమూనా బోర్డులను కూడా పంపింది. ప్రస్తుతం షుగర్ వ్యాధి బాధితులు దాదాపు ఇంటికొకరు చొప్పున ఉంటున్నారు. భవిష్యత్తులో ఈ వ్యాధి మరింత తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి చిన్న వయసు వారికి కూడా షుగర్ వ్యాధి వస్తోంది. గతంలో 40 ఏళ్ల వయసు పైబడిన వారిలో మాత్రమే షుగర్ వ్యాధి లక్షణాలు కనిపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. దీంతో విద్యాశాఖ షుగర్ వ్యాధి నియంత్రణే లక్ష్యంగా విద్యార్థి దశనుంచే సమగ్ర అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. ప్రత్యేకంగా బోర్డులు తయారు చేయించింది. వాటిని తరగతి గదుల్లో ప్రదర్శనకు ఏర్పాటు చేయనుంది. కాగా నేటితరం ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడటం వల్ల వివిధ రోగాల బారిన పడడమే కాకుండా షుగర్ వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పంచదార వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేయాలని విద్యాశాఖ సూచించింది. షుగర్ వ్యాధి నియంత్రణ కోసం చక్కెర వినియోగంపై పరిమితులు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకునే విధంగా విద్యార్థులను తయారు చేయాలని నిర్దేశించింది. షుగర్ బోర్డులను పాఠశాల తరగతి గదులతో పాటు పాఠశాల ప్రాంగణాల్లోనూ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రోజుకు పెద్దలు 25 గ్రాములకు మించి చక్కెర ఉన్న పదార్థాలు తీసుకోకూడదని, పిల్లలు 20 గ్రాములు మించి చక్కెర ఉన్న పదార్థాలను తీసుకోకూడదని సూచించింది. తక్కువ చక్కెర తీసుకోండి జీవితాన్ని ఎక్కువ పెంచుకోండి అనే నినాదాన్ని కూడా ఆంగ్లంలో ప్రచురించింది. బోర్డుల నమూనాలను పాఠశాలలకు పంపేలా చర్యలు చేపడుతున్నారు.

శుభపరిణామం



షుగర్ వ్యాధిపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించేలా తరగతి గదుల్లో షుగర్ బోర్డుల ఏర్పాటుకు విద్యాశాఖ చర్యలు చేపట్టడం శుభపరిణామం. నేటితరం ఆహారపు అలవాట్లలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి షుగర్ వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలి అలవర్చుకునేలా విద్యార్థులను తయారు చేయాలి.

– స్వప్నరెడ్డి, వైద్యాధికారిణి, సీతారామపురం పీహెచ్‌సీ

అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థులకు అసెంబ్లీ సమయంలో షుగర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నాం. పంచదార వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేసి వారిని చైతన్యపరుస్తున్నాం. అలాగే తరగతి గదుల్లో కూడా ప్రత్యేక షుగర్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం.

– షేక్.మస్తాన్‌వలి, ఎంఈఓ, సీతారామపురం



హరివిల్లు కనువిందు

ఆత్మకూరు మండలం బంట్లపల్లి సమీపంలోని ఉత్తర కాలువపై ఆకాశంలో హరివిల్లు విరిసింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి పొలాల్లో నీరు చేరింది. ఆదివారం ఉదయం భానుడి కిరణాలు వర్షపు నీటిలో పడి మేఘాలపై సప్తవర్ణ శోభితమైన ఇంద్రధనస్సు ఆవిష్కృతమై కనువిందు చేసింది.

–ఆత్మకూరు రూరల్